## క్లుప్తంగా

### నేడు అంబాజీపేట ప్రభల ఉత్సవం

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట సెంటర్‌లో ఏటా నిర్వహించే ప్రభల తీర్థం (చక్రతీర్థం) గురువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మాచవరంలోని రామ్‌ఘాట్‌లో వేంచేసిన పార్వతీ రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి, యువగణపతి ఆలయాల వద్ద నుంచి ప్రభలను ఊరేగింపుగా తీసుకొచ్చి సెంటర్‌లో కొలువుదీరుతాయి. అనంతరం తీర్థం నిర్వహించనున్నారు.

### వైభవంగా మకర జ్యోతి దర్శనం



అలమూరులో జరిగిన అయ్యప్పస్వామి తెప్పోత్సవంలో పాల్గొన్న ఆనంద తీర్థాచార్యులు దంపతులు

అలమూరు: శబరిమల తరహాలో అయ్యప్ప స్వామి మకరజ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిచ్చాడు. నాగులచెరువులో స్వామి వారికి నిర్వహించిన తెప్పోత్సవం భక్తులను అలరించింది. మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణతో ఆ ప్రాంతమంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. అలమూరులో అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మకరజ్యోతి దర్శనం, తెప్పోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగాయి. అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన ఈ ఉత్సవాల్లో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ డైరెక్టర్ పగడాల ఆనంద తీర్థాచార్యులు దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకులు పి.ముకేందరస్వామి, దేవస్థానం కమిటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ ఆధ్వర్యంలో ఆలయ పురోహితుడు అంగర సింగ్‌బాబు ఆభరణాలను నెత్తిన ధరించి ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరారు. సన్నాయి వాయిద్యాలు, బ్యాండు మేళాల మధ్య నిర్వహించిన ఈ యాత్రకు భక్తులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు.

### సేవకు ప్రతిరూపం 'సేవా సంక్రాంతి'

సఖినేటిపల్లి: సేవకు ప్రతిరూపం సేవా సంక్రాంతి సంస్థ అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఉయ్యూరువారి మెరక ఏఎస్ఎన్ రాజు కమ్యూనిటీ హాల్‌లో స్థానిక బాలగణపతి యువజన సేవా సమితి (సేవా సంక్రాంతి) 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ సంచికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. సేవా సంక్రాంతి కార్యక్రమాలు డిజిటల్ రూపంలో తెచ్చిన వెబ్‌సైటు ప్రముఖులు ఆవిష్కరించారు. హెచ్ఎం చింతా బాలమణి అధ్యక్షతన జరిగిన సదస్సులో పలువురు ప్రముఖులు మాట్లాడారు. 20 మంది దివ్యాంగులు, వయోవృద్ధులుకు, 12 మంది పేదలకు ఉపకార వేతనాలు, 18 మంది రోగులకు అత్యవసర వైద్య ఖర్చుల సాయం పంపిణీ చేశారు.

### ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దేవ

సఖినేటిపల్లి: అప్పనరామునిలంకలో కొలువైన ముత్యాలమ్మని మంగళవారం సంక్రాంతి పర్వదినాన రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ దర్శించుకున్నారు. అలాగే అంతర్వేదిపాలెంలో హల్లెలూయ గ్రౌండ్స్‌లో జరిగిన ఐపీసీ చర్చి విమోచన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వెంట ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, నాయకులు మంగెన వెంకట స్వామినాయుడు, రావూరి పెద్దబ్బులు, పినిశెట్టి బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### ఒకే ధర్మం, ఒకే సంస్కృతి భావనతో సమానత్వం



కొత్తపేటలో ప్రభలను దర్శించుకుంటున్న ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రచారక్ విజయాదిత్య బృందం

కొత్తపేట: ఉన్నత సంస్కారాలతో, ఒకే ధర్మం-ఒకే సంస్కృతి అనే భావనతో, ఆలోచనలు, ఆకాంక్షలలో సమానత్వం ఆధారంగా ఈ దేశపు జాతీయ జీవనం నిర్మాణమైందని ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రచారక్ విజయాదిత్య అన్నారు. మంగళవారం కొత్తపేట సంక్రాంతి ఉత్సవాల్లో విజయాదిత్య, వారి విదేశీ మిత్ర బృందం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మకర సంక్రమణం వంటి పర్వదినాలు మన ఈ ప్రాచీన సంస్కారాలను, భావనలను సుదృఢం చేస్తాయని, అంతేగాక సంక్రాంతి సమయంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు అంటే హరిదాసు, బుడబుక్కలవారు, జంగం దేవరలు, గంగిరెద్దుల వారు, పిట్టల దొరలు, సోదెమ్మలు, భట్రాజులు, కొమ్మదాసర్లు, రైతులు, గ్రామవాసులు, నగరవాసులు వంటి వారందరూ కలసి పరస్పరం సహకరించుకుంటూ పండుగను జరుపుకొంటారని, అందుకే సంక్రాంతి పండగ సామాజిక సమరసతకు నాంది పలుకుతుందని తెలిపారు. ఈ సంస్కృతీ సంప్రదాయాలను విధిగా కొనసాగిస్తూ భావి తరాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, ఆర్ఎస్ఎస్ ఖండ సంచాలక్ టీఎస్ఆర్ అంజనేయులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కుందాలపల్లి డ్యామ్ సెంటర్‌కు పంట చేల మీదుగా ప్రభలను మోసుకువస్తున్న భక్తులు



పి.గన్నవరం మండలం గాజులగుంట గ్రామంలో విద్యుత్ దీపాల వెలుగులో ప్రభలు



మామిడికుదురు మండలంలో కాలువలో నుంచి తీసుకువస్తున్న పెదపట్నం ప్రభ



మామిడికుదురు తీర్థ స్థలికి పంట పొలాల నుంచి తీసుకువస్తున్న ప్రభ



అయినవిల్లి మండలం తొత్తరమూడిలో ఊరేగుతున్న ప్రభలు

# ప్రభవించిన ఆనందం

- అంగరంగ వైభవంగా తీర్థం
- కోలాహలంగా ప్రభల ఊరేగింపు
- దర్శనానికి పోటెత్తిన భక్తులు

మామిడికుదురు: సంప్రదాయానికి అనుగుణంగా కనుమ పండుగను పురస్కరించుకుని బుధవారం ప్రభల తీర్థం కొర్లగుంటలో అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి సుందరంగా అలంకరించిన ప్రభలను భక్తులు తీర్థ స్థలికి తీసుకు వచ్చారు. మామిడికుదురు శివారు కొర్లగుంట తీర్థ స్థలిలో ఏర్పాటు చేసిన ప్రభలను వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పెదపట్నం, మామిడికుదురు, పాశర్లపూడి, నగరం, ఈదరాడ గ్రామాలకు చెందిన ప్రభలు కొర్లగుంటలో కొలువుదీరాయి. పెదపట్నం నుంచి తొమ్మిది ప్రభలను తీర్థానికి తీసుకువచ్చారు. పెదపట్నం నుంచి తీసుకు వచ్చిన ప్రభలను భక్తులు హర... హరా... అంటూ పంట కాలువలో మోకల్లోతు నీటిలో దిగి తీసుకువచ్చిన దృశ్యాలు భక్తులను తన్మయత్వానికి గురి చేశాయి. ఈ కనువిందైన దృశ్యాలను చూసేందుకు భక్తులు ఏటిగట్టుపై బారులు తీరారు. ప్రభలను తీర్థస్థలికి తీసుకు వచ్చేటప్పుడు, తీర్థం ముగిసిన తర్వాత ప్రభలను తిరిగి పెదపట్నం తీసుకు వెళ్లే సమయంలోను ఇవే దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. పచ్చని కొబ్బరితోటలు, పంట పొలాల మధ్య నుంచి ప్రభలను తరలించిన తీరు చూపరులకు కనువిందు కలిగించింది. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, బాణాసంచా కాల్పులు, కేరళ వాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదకరంగా జరిగింది. మండలంలోని మొగలికుదురు, గెద్దాడ గ్రామాల ప్రభలను రాజోలు మండలం పాదలాడ తీర్థస్థలికి తీసుకు వెళ్లారు. ప్రభల తీర్థం సందర్భంగా ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రభల తీర్థం చూసి తన్మయత్వం చెందారు.

**కుందాలపల్లిలో..**

పి.గన్నవరం: కుందాలపల్లి–అవిడి డ్యామ్ సెంటర్‌లో ప్రభల తీర్థం బుధవారం కన్నులపండువగా జరిగింది. డ్యామ్ సెంటర్‌కు పి.గన్నవరం, అంబాజీపేట, కొత్తపేట మండలాల పరిధిలోని పలు గ్రామాల నుంచి 50కి పైగా ప్రభలను తీసుకు వచ్చారు. తీర్థ మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. పి.గన్నవరం మండలం నరేంద్రపురం, పప్పులవారిపాలెం, కుందాలపల్లి గ్రామాలకు చెందిన ప్రభలను బ్యాండు మేళాలతో ఊరేగిస్తూ తీసుకువచ్చారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు. ఉత్సవ ప్రభలను పంట కాలువ దాటించి తీర్థస్థలికి తీసుకు వచ్చారు. పంట కాలువలో నుంచి ప్రభలను దాటించే దృశ్యాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు. అలాగే కొత్తపేట మండలం మోడేకుర్రు, రాకుర్తివారిపాలెం, అవిడి గ్రామాలకు చెందిన ప్రభలను పంట చేల మీదుగా భక్తులు భుజాలపై డ్యాంసెంటర్‌కు మోసుకువచ్చారు. అంబాజీపేట మండలం చిరతపూడి తదితర గ్రామాలకు చెందిన ప్రభలను రోడ్డు మార్గంలో తీసుకువచ్చారు. ఈనేపథ్యంలో డ్యామ్ సెంటర్లో కొలువుదీరిన ప్రభలను వేలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎస్సై బి.శివకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎస్సై పి.గంగాభవానీ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. నరేంద్రపురం గ్రామంలో మల్లేశ్వరస్వామి ప్రభను డీఐజీ ఏసుబాబు దర్శించుకున్నారు. కుందాలపల్లి గ్రామంలో జరిగిన తీర్థ మహోత్సవానికి తరలివెళ్తున్న ప్రభకు ఏసుబాబుతో పాటు, ఆయన కుటుంబ సభ్యులు పూజలు చేశారు.

**విద్యుత్ వెలుగుల్లో సంక్రాంతి ప్రభలు**

పి.గన్నవరం: మండలంలోని పోతవరం శివారు గాజులగుంటలో బుధవారం ప్రభల తీర్థ మహోత్సవం వైభవంగా జరిగింది. తీర్థానికి వచ్చిన ఉత్సవ ప్రభలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో రాత్రివేళ విద్యుత్ దీపాల వెలుగులో ప్రభలు మిరిమిట్లు గొలుపుతూ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే నాగుల్లంక గ్రామంలో కూడా ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించారు. తీర్థ మహోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రభలను దర్శించుకుని, పూజలు చేశారు.

**తొండవరంలో..**

అంబాజీపేట: మండలంలోని వాకలగరువు ఉమా సర్వేశ్వరస్వామి, తొండవరం ఉమా తొండేశ్వర స్వామి, గున్నేపల్లి ప్రభలు తొండవరంలో కొలువుదీరాయి. వాకలగరువు 53, తొండవరం 55 అడుగుల ప్రభలు చూపరులను కనువిందు చేశాయి. ఏకాదశ రుద్రులను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, కల్చరల్ అండ్ క్రియేటివిటీ చైర్ పర్సన్ తేజస్విని పొడపటి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు దర్శించుకున్నారు.

**భారీ బందోబస్తు**

ప్రభల వెంట, ప్రభలు వచ్చే రహదారులలోను, తీర్థం జరిగే ప్రాంతాల్లో కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు, సీఐ ఆర్.భీమరాజు, ఎస్సై కె.చిరంజీవి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించడం, కమిటీ సభ్యులు, ప్రజల సహకారంతో తీర్థం ప్రశాంతంగా సాగింది.

**ముక్తేశ్వరంలో..**

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి, వెలవలపల్లి, చింతనలంక, మడుపల్లి, విలస, సిరిపల్లి, తొత్తరమూడి, అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి, వేమవరం ప్రభలను గ్రామస్తులు ఊరేగింపుగా మండల కేంద్రమైన ముక్తేశ్వరంలోని ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వరస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల దర్శనార్థం కొలువుదీరాయి. ప్రభలపై కొలువుదీరిన స్వామివార్లను భక్తులకు దర్శించి కానుకలు, మొక్కులు చెల్లించారు. మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రభల ఉత్సవాన్ని తిలకించారు. ముక్తేశ్వరం ప్రధాన కూడలిలో భక్తులతో జనసంద్రంగా మారింది. పోలీసు, రెవెన్యూశాఖలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాయి. కాగా వీరవల్లిపాలెం, మాగాం, కొండుకుదురు, కె.జగన్నాథపురం, పోతుకుర్రు, క్రాప గ్రామాల్లో ప్రభల ఉత్సవం ఘనంగా జరిపారు. నేదునూరు ప్రభ అంబాజీపేట మండలంలోని జగ్గనతోటలో ఉత్సవానికి ఊరేగింపుగా బయలుదేరి వెళ్లింది.



వాకలగరువు సెంటర్‌లో కొలువుతీరిన రాష్ట్రంలోనే అత్యంత పొడవైన వాకలగరువు, తొండవరం ప్రభలు

# స్నేహ బంధం ఎంత మధురమో

### పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మామిడికుదురు/అంబాజీపేట/సఖినేటిపల్లి: మగటపల్లి, అంబాజీపేట, మోరి జెడ్పీ హైస్కూళ్లలోని ఆయా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఆటలు ఆడి, పాటలు పాడుతూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సుమారు 50 ఏళ్ల అనంతరం కలుసుకున్న విద్యార్థులు వారి గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఎవరెవరు ఏయే హోదాల్లో ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో, ఎక్కడెక్కడ స్థిరపడ్డారో కూడా ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు.



అంబాజీపేటలో కలుసుకున్న 2005 బ్యాచ్ విద్యార్థులు

### క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనం

మలికిపురం: లక్కవరంలో రుద్రరాజు గోపాలకృష్ణంరాజు ఇంటి వద్ద బుధవారం క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన సత్యనారాయణరాజు (రాజమండ్రి) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లక్కవరం క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో మంగెనను ఘనంగా సత్కరించారు. అనంతరం గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన క్షత్రియులకు, క్షత్రియ సేవా సమితి ద్వారా వచ్చే నిధులు ద్వారా సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు క్షత్రియులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో సూరిబాబును సన్మానిస్తున్న 1990 బ్యాచ్ విద్యార్థులు



మగటపల్లిలో సందడి చేసిన పూర్వ విద్యార్థులు



మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 1975-76 బ్యాచ్ విద్యార్థులు



లక్కవరంలో మంతెన సత్యనారాయణ రాజును సన్మానించిన క్షత్రియులు

### వృద్ధులకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ

రావులపాలెం: స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యుడు గొలుగూరి మురళీకృష్ణారెడ్డి కుమార్తె తన్వి పుట్టినరోజు సందర్భంగా సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక రెడ్డి కల్యాణ మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో 70 మంది నిరుపేద వృద్ధులకు నిత్యావసరాలు, పండ్లు బ్రెడ్లు, టవల్స్ సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.

### నీటి సంఘం డైరెక్టర్ మృతి



లక్కింశెట్టి త్రినాథస్వామి

రాజోలు: రాజోలు సాగు నీటి సంఘం డైరెక్టర్ లక్కింశెట్టి త్రినాథ స్వామి(67) హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాజోలులో ఆటో మొబైల్ వ్యాపారం నిర్వహిస్తూ ఆర్యవైశ్య సంఘ సభ్యుడిగా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన మృతికి రాజోలు చాంబర్ ఆఫ్ కామర్స్, రోటరీ క్లబ్, ఆర్య వైశ్య సంఘ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

### పేరంటాలమ్మకు కావళ్ల సారె

ఆలమూరు: మండలంలోని జొన్నాడ లంక భూముల్లో వేంచేసియున్న పేరంటాలమ్మకు కావళ్లతో సారె సమర్పించిన తీరు ప్రత్యేకత సంతరించుకుంది. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా గ్రామ ఇలవేల్పుగా భావించే అమ్మవారికి ఏటా మకర సంక్రాంతి రోజున ప్రతి ఇంటి నుంచి చీర, రవిక, పానకం, పిండివంటలు, అరటి పండ్లను కావళ్లలో అమర్చుకుని ఊరేగింపుగా రైతులు అమ్మవారి ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. స్థానిక ఎస్సై ఎం.అశోక్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఆకట్టుకున్న సంక్రాంతి సంబరాలు

రావులపాలెం: స్థానిక పోతంశెట్టి రామిరెడ్డి పార్కు వద్ద సీఆర్‌సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేమన జయంతి సంక్రాంతి సంబరాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. బుధవారం సంబరాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పార్కులో ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్, చిన్నారుల నృత్యాలు, డ్యాన్స్ టీమ్‌ల ప్రదర్శన, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# కొత్తపేటలో ప్రభవించిన సంక్రాంతి

- 24 గంటల పాటు ఉర్రూతలూగించిన ప్రభల ఉత్సవం
- కోలాహలంగా పాత, కొత్త రామాలయ వీధుల ప్రభల ఊరేగింపు
- రాష్ట్రం నలుమూలల నుంచీ వచ్చిన జనంతో కిటకిటలాడిన కొత్తపేట

కొత్తపేట: ఉభయ గోదావరి జిల్లాల్లోనే పేరెన్నికగన్న కొత్తపేట ప్రభల ఉత్సవం మంగళవారం ఉదయం వైభవంగా ప్రారంభమై ఆద్యంతం అంబరాన్ని తాకింది. వివిధ రూపాలు, ఘట్టాలుగా బుధవారం ఉదయం వరకూ ఉత్సవం కొనసాగి ప్రశాంతంగా ముగిసింది. అన్ని ప్రాంతాల్లో ప్రభల ఉత్సవాలు కనుమ పండగ రోజున జరుగుతుండగా కొత్తపేటలో మాత్రం అనాదిగా మకర సంక్రాంతి రోజున నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆ మేరకు 24 గంటల పాటు నిరంతరాయంగా ప్రభల ఉత్సవం కొనసాగింది. పాత, కొత్తరామాలయం వీధుల వారు ఒకరి తరువాత ఒకరు తమ వీధుల ప్రభలతో గ్రామ పెద్దలు, ఆబాల గోపాలం ప్రభల ముందు హుందాగా నడవగా భారీ ఊరేగింపుతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ప్రాంగణాలకు చేరుకున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ కాలేజీ గ్రౌండ్‌లో, అనంతరం ప్రభల తిరుగు ఊరేగింపులో భాగంగా అర్ధరాత్రి 2 గంటల నుంచి బుధవారం ఉదయం 5.30 గంటల వరకూ పాత బస్టాండ్ సెంటర్‌లో నయనానందం, శ్రవణానందకరంగా రంగురంగుల కాంతులతో గగన వీధుల్లో అనేక రకాల బాణసంచా సెట్లు, విన్యాసాలు ప్రజలను ఉర్రూతలూగించాయి. అలా ఒక్క రోజు సుమారు రూ.15 లక్షలు విలువ చేసే బాణసంచా కాల్పులు, సుమారు రూ.15 లక్షలతో బ్యాండ్ మేళాలు, ఆర్కెస్ట్రాలు, వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పలువురు ప్రముఖులు మంగళవారం సాయంత్రం ప్రభలను దర్శించుకున్నారు. ఆయనకు ఆయా ఉత్సవ కమిటీలు ఘనస్వాగతం పలికి తోడ్కొని వెళ్లారు.



కొత్తపేటలో ప్రభల ఊరేగింపు ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు

**జనసంద్రంగా మారిన కొత్తపేట**

గతంలో ఎప్పుడూ రాని విధంగా ఈసారి కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవానికి అత్యధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. కోస్తా జిల్లాల నుంచే కాక ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి, తెలంగాణ నుంచి ప్రజలు తరలి రావడంతో కనీ వినీ ఎరుగని రీతిలో కొత్తపేట జనసంద్రంగా మారింది. ఏ రోడ్డు చూసినా, ఏ వీధి చూసినా కిక్కిరిసిన జనంతో నిండాయి. పగటి పూట, రాత్రి పూట ఉత్సవాలు, బాణసంచా కాల్పులను సుమారు 1.50 లక్షల మంది జనం తిలకించి ఉంటారని అంచనా.

**ప్రశాంతంగా ముగిసిన ఉత్సవం**

పోలీసుశాఖ ముందస్తు చర్యలతో ఎక్కడా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**వైభవంగా కనుమ ఉత్సవాలు**

మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం కనుమ పండగ సందర్భంగా ప్రభల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. కొత్తపేట మండలం మందపల్లి, అవిడి, పి.గన్నవరం మండలంలోని పప్పులవారిపాలెం, అంబాజీపేట మండలం చిరతపూడి గ్రామాల కూడలి అవిడి డ్యామ్ సెంటర్ వద్ద ప్రభల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మందపల్లి పెద్ద వంతెన సమీపంలో జరిగే ఉత్సవంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. అవిడి, మోడేకుర్రు గ్రామాలను చెందిన అనేక ప్రభలను అవిడి డ్యామ్ సెంటర్ ఉత్సవానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు.



కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవంలో కాంతులు వెదజల్లుతున్న బాణసంచా సెట్

### సంక్రాంతి సందడే సందడి..

కొత్తపేట: ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర వృత్తుల కోసం చెట్టుకొకరు, పుట్టకొకరుగా విడివడి కుటుంబపు అనుబంధాలు, ఆనందాలను ఆస్వాదించలేని వారు ఎందరో. ఇటువంటి వారికి సంక్రాంతి పండగ అనుభూతిని పంచుకుంటుంది. అటువంటి సందడే సందడికి వేదిక అయ్యింది.. కొత్తపేట మండలం బిళ్లకుర్రు శివారు వాకాడవారిపాలెం. అబుదాబి దేశంలో వైద్య వృత్తిలో తీరిక లేకుండా ఉన్న అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామస్తులు డాక్టర్ వర్రే పద్మరాజు–డాక్టర్ సంధ్యారాణి దంపతులు చిరకాలం తరువాత మాతృభూమికి వచ్చి బంధువర్గంతో సంక్రాంతి పండగ జరుపుకోవాలని తలచారు. తలచిందే తడవుగా తమ ఆలోచనను వాకాడవారిపాలెంలో తన బావ, ఆ గ్రామ పెద్ద వాకాడ గోవిందరావు దృష్టిలో పెట్టారు. ఆయన ఆమోదంతో వాకాడవారిపాలెం గ్రామాన్ని సంక్రాంతి సంబరాలకు వేదికగా నిర్ణయించారు. గోవిందరావు పర్యవేక్షణలో డాక్టర్ పద్మరాజు–డాక్టర్ సంధ్య దంపతులు ఆధ్వర్యంలో జరిగిన సంబరాలకు అమెరికాలో డాక్టర్‌గా, ఓ కంపెనీ సీఈఓగా పనిచేస్తున్న ఆ దంపతుల కుమార్తెలు డాక్టర్ అనీషా, అశ్విని కూడా హాజరయ్యారు. పద్మరాజు కుటుంబ సభ్యులు, బంధువులు, ఆ గ్రామస్తులు కలసి సంతోషంగా గడిపి ఆనందానుభూతిని పొందారు. సుమారు 60 కుటుంబాలకు చెందిన అన్నదమ్ములు, తోడికోడళ్లు, ఆడపడుచులు, బావలు, అల్లుళ్లు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లు, మునిమనవళ్లు అందరూ కలసి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, పెద్ద అరటిఆకుల్లో అందరూ కలిసి అల్పాహారం, విందు భోజనాలు చేస్తూ, చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఎంతో ఆనందంగా గడిపారు. వయసు రీత్యా ఎవరి స్థాయిలో వారికి వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వారి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హాజరయ్యారు.



వాకాడవారిపాలెంలో పద్మరాజు-సంధ్యారాణి దంపతులతో గ్రామ పెద్దలు

### సందడి చేసిన బండి



కేశనపల్లిలో అలరించిన పొట్టిగిత్తల బండి

మలికిపురం: మండలంలోని కేశనపల్లిలో బుధవారం స్థానికులు ఏర్పాటు చేసిన పొట్టిగిత్తల బండి ఆకర్షించింది. చూడముచ్చట గొలిపిన పొట్టిగిత్తలు అలరించాయి.